సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 7 । డిసెంబర్ । 2023



పెరుగుతూ.. తగ్గుతూ..
తుపాను ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం స్వల్పంగా పెరిగి.. రాత్రి వరకు మళ్లీ తగ్గింది. 10లో



బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
వర్షాల కారణంగా మూడు రోజులుగా బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లుతోంది. సంస్థకు రోజుకు రూ.6 కోట్ల మేర నష్టం వస్తోంది. 10లో



వాతావరణం
జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

మన భట్టే.. డిప్యూటీ సీఎం

- మంత్రివర్గంలో కీలకశాఖ కేటాయించే అవకాశం
- నేడు ఎల్‌బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తరలివెళ్లిన అనుచరులు

తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎంగా మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు అవకాశం దక్కింది. తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా.. సీఎం పదవి కోసం భట్టి చివరి వరకు ప్రయత్నించారు. అయితే, అధిష్టానం రేవంత్‌రెడ్డికి సీఎం పదవి కట్టబెట్టగా, భట్టికి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చింది. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆ తర్వాత భట్టి, ఇతర మంత్రులు ప్రమాణం స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఉమ్మడి జిల్లాలోని పార్టీ నేతలకు ఆహ్వానాలు అందాయి. ఇప్పటికే కాంగ్రెస్ శ్రేణులు, భట్టి అభిమానులు హైదరాబాద్ చేరుకున్నారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

తొలి డిప్యూటీ సీఎం

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన జలగం వెంగళరావు ఉమ్మడి ఏపీకి ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఖమ్మం రాజకీయ ప్రస్థానంలో దక్కిన అత్యున్నత పదవి ఇదే. ఆ తర్వాత మంత్రులుగా శీలం సిద్దారెడ్డి, కోనేరు నాగేశ్వరరావు, సంభాని చంద్రశేఖర్, తుమ్మల నాగేశ్వరరావు, రాంరెడ్డి వెంకటరెడ్డి, వనమా వెంకటేశ్వరరావు, పువ్వాడ అజయ్‌కుమార్ ఉమ్మడి ఏపీతో పాటు తెలంగాణలో కొనసాగారు. మళ్లీ ఇప్పుడు జలగం వెంగళరావు తర్వాత అత్యున్నత పదవి భట్టికి దక్కింది. సామాజిక సమీకరణలు, సుదీర్ఘకాలం పార్టీకి చేసిన సేవ, పార్టీ, అధినాయకత్వం పట్ల విధేయత తదితర అంశాలను బేరీజు వేసుకుని రేవంత్‌రెడ్డి తర్వాత ప్రాధాన్యత పదవిని భట్టికి అధిష్టానం కట్టబెట్టింది.

వైఎస్ ప్రభుత్వంలో కీలకంగా..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో భట్టి విక్రమార్క కీలకంగా వ్యవహరించారు. 2004లో ఆయనకు టికెట్ రాకున్నా, 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2009 నుంచి 2011 వరకు ప్రభుత్వ చీఫ్ విప్‌గా, ఆ తర్వాత డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2019 నుంచి ఇప్పటి వరకు సీఎల్పీ నేతగా వ్యవహరించారు. పార్టీని అంటిపెట్టుకుని ఉండడమే కాక ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేశారు. అధిష్టానం పిలుపుతో ఈఏడాది మార్చి 16న ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గం పిప్పిరి గ్రామం నుంచి పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రారంభించారు. రాష్ట్రంలోని 17 జిల్లాలు, 36 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1,365 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. ఈ యాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మంలో ఈ ఏడాది జూలై 2న రాహుల్ గాంధీ ముఖ్యఅతిథిగా జన గర్జన సభ నిర్వహించారు.

రెండో విడతలో పొంగులేటి, తుమ్మల

ఖమ్మం, పాలేరు ఎమ్మెల్యేలు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సైతం మలి విడత మంత్రివర్గ విస్తరణలో పదవులు దక్కే అవకాశం ఉంది. తొలి విడతలో గురువారం ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డితోపాటు మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరితోపాటు మరో నలుగురు ప్రమాణం చేయనున్నట్లు ఇప్పటికే వెల్లడించారు. సామాజిక సమీకరణల నేపథ్యాన మలివిడతలో ఉమ్మడి జిల్లా నుంచి పొంగులేటి, తుమ్మలకు అవకాశం లభించనున్నట్లు తెలిసింది. పొంగులేటికి కీలక మంత్రి పదవి దక్కుతుందని తెలుస్తుండగా, తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవి లేదా స్పీకర్ పదవి వచ్చే అవకాశముందని సమాచారం.

నాలుగోసారి విజయదుందుభి..

మధిర అసెంబ్లీ స్థానం నుంచి 2009, 2014, 2018 ఎన్నికలతో పాటు తాజా ఎన్నికల్లోనూ భట్టి విజయం సాధించారు. 2009 నుంచి పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీపరంగా నాలుగు సార్లు వరుసగా విజయం సాధించి విజయదుందుభి మోగించింది భట్టి ఒక్కరే. ఆయన రాజకీయ ప్రస్థానం తొలుత ఆంధ్రా బ్యాంక్ డైరెక్టర్‌గా ప్రారంభమైంది. 1990 నుంచి 1992 వరకు పీసీసీ కార్యనిర్వాహక సభ్యుడిగా పనిచేశారు. 2000 నుంచి 2003 వరకు పీసీసీ కార్యదర్శిగా పనిచేయగా.. 2007లో ఖమ్మం జిల్లా నుంచి ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2009 నుండి 2011 వరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్‌గా కొనసాగారు. 2011 నుండి 2014 వరకు ఆంధ్రప్రదేశ్ శాసనసభకు డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించారు.



మల్లు భట్టివిక్రమార్క ప్రొఫైల్

జననం : 1961 జూన్ 15
స్వస్థలం : స్నానాల లక్ష్మీపురం, వైరా మండలం
తల్లిదండ్రులు : మాణిక్యమ్మ – అఖిలాండ
విద్యార్హత : ఎంఏ
భార్య : నందిని, కుమారులు సూర్య విక్రమాదిత్య, సహేంద్ర విక్రమాదిత్య
- భట్టి విక్రమార్క సోదరుడు మల్లు అనంతరాములు నాగర్‌కర్నూల్ ఎంపీగా 1980, 1989 ఎన్నికల్లో గెలవడమే కాక పీసీసీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. ఆయన మరో సోదరుడు మల్లు రవి సైతం 1991, 1998 ఎన్నికల్లో ఎంపీగా గెలిచారు.

న్యూస్‌రీల్

వైభవోపేతంగా రామయ్య నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం వైభవోపేతంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలుచేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆన్‌లైన్ బాధ్యత ఉపాధ్యాయులదే..


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): యూడైస్ ప్లస్ డేటా, ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు ఆన్‌లైన్‌లో నమోదు చేసే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల స్పష్టం చేశారు. తన చాంబర్‌లో బుధవారం ఎంఈఓలు, అన్ని యాజమాన్యాల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా డేటా ఎంట్రీ చేయాలన్నారు. తప్పులు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని, నమోదు చేసిన డేటా సరైనదా లేదా పరిశీలించాలని సూచించారు. ఈనెల 12వ తేదీ లోగా డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాస్థాయిలో త్వరలో నిర్వహించే సైన్స్‌ఫేర్‌లో అన్ని పాఠశాలల యాజమాన్యాలు పాల్గొనాలని సూచించారు. సమావేశంలో డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, కోఆర్డినేటర్లు నాగరాజశేఖర్, అన్నామణి, ఏపీఓ రాజేష్‌కుమార్, టెక్నికల్ పర్సన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం వర్షార్పణం

- జిల్లా వ్యాప్తంగా నీటమునిగిన పంటలు
- వేల ఎకరాల్లో ధ్వంసమైన వరి, పత్తి, మిర్చి
- నేలమట్టమైన ఉద్యాన తోటలు
- చేతికందే దశలో రైతులకు తీరని నష్టం
- జిల్లాలో నగటు వర్షపాతం 16.2 సెం.మీ.


చర్ల మండలం కుదునూరులో విరిగిపోయిన మిరప చెట్లను చూపిస్తున్న రైతు

బూర్గంపాడు/సూపర్‌బజార్(కొత్తగూడెం): మిచాంగ్ తుపాను రైతులకు కన్నీటిని మిగిల్చింది. రెండు రోజులు ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ఆరుగాలం శ్రమ ఫలితం చేతికందే సమయంలో కురిసిన వర్షాలతో పంట నీటమునగటంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చడమెలా అనే ఆవేదన వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వరి, పత్తి, మిర్చి, ఉద్యాన, అపరాల పంటలు పూర్తిగా నీట మునగడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

16.2 సెం.మీ వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా బుధవారం సరాసరి 16.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా అశ్వారావుపేటలో 32.4 సెం.మీ., అత్యల్పంగా గుండాలలో 7.2 సెం.మీ. వర్షం కురిసింది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అధికారిక లెక్కల ప్రకారం 7,450 మంది రైతులకు చెందిన 13,608 ఎకరాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటలు ధ్వంసమయ్యాయి. 5,298 మంది రైతులకు చెందిన 8,816 ఎకరాల్లో వరి, 464 మంది రైతులకు సంబంధించి 1,602 ఎకరాల్లో వేరుశనగ, 323 మందికి చెందిన 585 ఎకరాల మొక్కజొన్న, 1,285 మంది రైతులకు చెందిన 2,475 ఎకరాల్లో మిర్చి, 80 మంది రైతులకు చెందిన 130 ఎకరాల్లో పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. అయితే అంతకుమించి అనేక ఎకరాల్లో పంటలు నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నీట మునిగిన వరిని కాపాడుకునేందుకు జోరువానలోనూ తీవ్రంగా శ్రమిస్తున్నారు.

రైతులకు తప్పని వి'పత్తి'..

ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులతో పత్తి దిగుబడి అంతంత మాత్రంగానే ఉంది. దీనికి తోడు ధర కూడా తక్కువే. ఈ తరుణంలో తుపాన్‌తో మరింతగా నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఇక గతేడాది మిర్చికి ధర ఉండడంతో ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెంచారు. ప్రస్తుతం కాపుదశలో ఉండగా వర్షాలతో తోటలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల చెట్లు పూర్తిగా విరిగిపోయాయి. మినుము, ఇతర పంటలకు సైతం తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నష్టం నివేదికలు సిద్ధం చేయాలని, ఎకరానికి కనీసం రూ.25 వేలు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

దెబ్బతిన్న ఉద్యాన పంటలు..

ఉద్యాన పంటలకు ఎక్కువగా అశ్వారావుపేట మండలంలోనే నష్టం వాటిల్లింది. ఈ మండలంలోని పలు గ్రామాల్లో 58 మందికి చెందిన 105 ఎకరాల్లో అరటి తోటలు నేలమట్టమయ్యాయి. పొగాకు తోటలు సైతం నేలవాలాయి. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో 24 మందికి చెందిన 12 ఎకరాల్లో కూరగాయల పంటలు ధ్వంసమయ్యాయి. అశ్వారావుపేట మండలం నారాయణపురంలో 27 మంది రైతులకు సంబంధించి 18 ఎకరాలు, అనుపాకలో 9మంది రైతులకు సంబంధించిన 5 ఎకరాల్లో పుచ్చకాయ పంటకు నష్టం వాటిల్లింది. సుజాతనగర్‌లో 9 ఎకరాల జామ తోటలు, బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో 8 ఎకరాల బొప్పాయి తోటలు నేలమట్టమయ్యాయి.

వారం రోజుల్లో కోయాలనుకున్నా



వారం రోజుల్లో కోయాలనుకున్న వరిపంట వర్షానికి పూర్తిగా నేలమట్టమైంది. వరద నీటితో అంతా మునిగిపోయింది. నాలుగు ఎకరాల్లో సాగు చేయగా కనీసం 150 బస్తాల ధాన్యం పండుతుందని ఆశించాం. ఇప్పుడు గింజ కూడా చేతికొచ్చేలా లేదు. అధికారులు దెబ్బతిన్న పంటలు పరిశీలించి సాయం అందించాలి.
– మల్లికంటి వెంకటేశ్వర్లు, భాస్కర్‌నగర్

అప్పులెలా తీర్చాలో..



రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి పంటంతా దెబ్బతిన్నది. గింజ చేతికొచ్చే పరిస్థితి లేదు. ఏడెకరాల్లో వేసిన వరి గాలివానకు చాప చుట్టినట్టయింది. మడుల్లో నుంచి నీరు బయటకు తీసేందుకు వీలు లేకుండా పోయింది. పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.
– బాసిబోయిన గంగరాజు, బూర్గంపాడు


పాల్వంచ మండలం దంతెలబోరలో నీట మునిగిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు


దమ్మపేట మండలం పెద్దగొల్లగూడెంలో నేలకొరిగిన అరటి తోట


సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లిలో నేలవాలిన వరి పొలం

చేజార్చుకున్నారు..

- తారుమారైన రాజకీయ నేతల అంచనాలు
- ఎన్నికల సమయంలో పార్టీల మార్పులు
- చాలామంది నేతలకు కలసిరాని నిర్ణయాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ అసెంబ్లీకి మూడోసారి జరిగిన సాధారణ ఎన్నికలు జిల్లాలోని అనేక మంది రాజకీయ నేతల రాతలు మార్చాయి. నిత్యం ప్రజల్లోనే ఉండే ఖద్దరు నేతలు సైతం ఓటరును అంచనా వేయడంలో తలకిందులయ్యారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని వీడి అనేక మంది కారెక్కారు. కానీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ ఢంకా మోగించి అధికారాన్ని దక్కించుకుంది. దీంతో పలువురు నాయకుల ప్రయాణంలో మరోసారి ముళ్లబాట ఎదురైంది.

టికెట్ రాలేదనే నైరాశ్యంతో..

- గతంలో బూర్గంపాడు, అశ్వారావుపేట నియోజకవర్గాల నుంచి తాటి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికై ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇక 2018 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందిన మెచ్చా నాగేశ్వరరావు గులాబీ కండువా కప్పుకోవడంతో తాటి అనివార్యంగా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యతో పొసగకపోయినా పార్టీలో నెట్టుకొచ్చారు. ఇటీవలి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. స్థానికంగా తుమ్మల నాగేశ్వరరావు మొదలు ఏఐసీసీ పెద్దల వరకు అన్ని రకాలుగా ప్రయత్నించినా టికెట్ హామీ రాలేదు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామనే హామీ వచ్చింది. దీంతో సంతృప్తి చెందని తాటి కాంగ్రెస్‌ను వీడి మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు.
- ప్రజారాజ్యం పార్టీ ద్వారా వెలుగులోకి వచ్చిన ఎడవల్లి కృష్ణ రాజకీయ ప్రయాణం ఆది నుంచీ ముళ్లబాటలోనే కొనసాగింది. కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన వనమా బీఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లాక కొత్తగూడెం నియోజకవర్గంలో హస్తం పార్టీకి ఎడవల్లి పెద్ద దిక్కుగా మారారు. ఓవైపు పోట్ల నాగేశ్వరరావు, నాగ సీతారాములు నుంచి పోటీ ఉన్నా ఎక్కడా వెనక్కు తగ్గలేదు. పొంగులేటి సైతం కొత్తగూడెం నుంచి ఆసక్తి చూపించినా కృష్ణ తన ప్రయత్నాలను మానలేదు. కానీ సీపీఐ రూపంలో వచ్చిన ఎన్నికల పొత్తు ఆయనకు ప్రతిబంధకంగా మారింది. టికెట్ ఆశించిన కృష్ణకు అధికారంలోకి వస్తే రాజకీయ భవిష్యత్‌కు కాంగ్రెస్ అధిష్టానం నుంచి మంచి గ్యారంటీనే లభించింది. అయినా సంతృప్తి చెందని ఎడవల్లి.. కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కారెక్కారు. ప్రతీసారి చివరి నిమిషంలో కృష్ణకు చుక్కెదురయ్యేది. కానీ ఈసారి అందుకు భిన్నంగా ఎడవల్లినే అడ్వాన్స్ స్టెప్ తీసుకున్నారు. అయితే, ఆ ప్రయత్నం కూడా వికటించిందనే చెప్పాలి.
- కోరం కనకయ్య కాంగ్రెస్‌ను వీడిన తర్వాత ఇల్లెందు నియోజకవర్గంలో పార్టీ వాణిని బలంగా వినిపించిన నేతల్లో చీమల వెంకటేశ్వర్లు ఒకరు. ఇల్లెందు కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ ఉన్నా ఎక్కడా తగ్గకుండా గత రెండేళ్లుగా పార్టీ పిలుపునకు తగ్గట్టుగా పని చేస్తూ వచ్చారు. కానీ చివరి నిమిషంలో కనకయ్యకు టికెట్ దక్కడంతో అలకబూనిన చీమల ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున బరిలో నిలిచారు. రెబల్స్‌గా ఉండొద్దని కాంగ్రెస్ పెద్దలు చెప్పిన సూచనను పరిగణనలోకి తీసుకుని మిగిలిన అభ్యర్థులు వెనక్కి తగ్గినా.. చీమల ఒక్కరే మొండిగా ముందుకెళ్లారు. చివరకు కాంగ్రెస్ హవాలో కొట్టుకుపోయారు. కామేపల్లి జెడ్పీటీసీ ప్రవీణ్ నాయక్‌దీ ఇంచుమించు ఇలాంటి పరిస్థితే.
- కొత్తగూడెం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలంటూ గాంధీభవన్‌లో లక్కినేని సురేందర్ దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత అనూహ్యంగా కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అక్కడితో ఆగకుండా అందర్నీ ఆశ్చర్యపరుస్తూ జనసేనలో చేరి గ్లాసు గుర్తుపై పోటీ చేశారు. పోలింగ్‌కు రెండు రోజుల ముందే బీజేపీ జిల్లా నాయకత్వం సహకరించడం లేదంటూ లక్కినేని అస్త్ర సన్యాసం చేసి పొలిటికల్ క్రాస్‌రోడ్‌లోకి వచ్చారు. ఇంకా ఎన్నికల సమయంలో ఓటరు నాడి పట్టుకోవడంలో విఫలమైన నాయకుల జాబితాలో కొత్తగూడెం నుంచి కోనేరు సత్యనారాయణ, అశ్వారావుపేట నుంచి కొడకండ్ల వెంకట్‌రెడ్డి, సున్నం నాగమణి కూడా ఉన్నారు.



చివరి నిమిషంలో..

జిల్లాలో ముందు నుంచీ కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలాన్ని కనబరుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జరిగిన 2009 ఎన్నికల నుంచి కమ్యూనిస్టుల కోటకు బీటలు వారుతున్నా కాంగ్రెస్ మాత్రం చెక్కు చెదరలేదు.. సరికదా మరింత బలంగా తన ఉనికి చాటుతూ వచ్చింది. 2018 ఎన్నికల్లోనూ ఇదే కనిపించింది. కానీ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ముగ్గురు, టీడీపీ నుంచి గెలిచిన ఒకరు మొత్తం నలుగురు బీఆర్‌ఎస్‌లో చేరడంతో పరిస్థితిలో మార్పు మొదలైంది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 'కారు' దూసుకుపోయింది. ఈ ఏడాది ఆరంభం నాటికి కాంగ్రెస్ పార్టీలో కొనసాగడం నడిసంద్రంలో నావ ప్రయాణం అన్నట్టు మారింది. అంత కష్టకాలంలోనూ హస్తాన్నే పట్టుకుని ఉన్న కొందరు నేతలు తీరా ఎన్నికల సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయడంలో విఫలమయ్యారు.

మూడు రోజుల్లో నష్టం అంచనాలు

- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన


దమ్మపేట మండలం సుధాపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట : మిచాంగ్ తుపానుతో పంటలు నష్టపోయిన వివరాలతో కూడిన నివేదికలను మూడు రోజుల్లో అందించాలని అధికారులను ఆదేశించినట్టు కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. అశ్వారావుపేట, నారంవారిగూడెం, ఊట్లపల్లి, దమ్మపేట మండలం సుధాపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి దెబ్బతిన్న పంటలు, ఇళ్లతో పాటు దమ్మపేటలో గండి పడిన పేరంటాల చెరువు, మునిగిపోయిన రాష్ట్రీయ రహదారిని పరిశీలించారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ప్రాథమిక అంచనా ప్రకారం 1200 ఎకరాల్లో వరి, ఇతర పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. అశ్వారావుపేటలోనే అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. చెరువులకు పడిన గండ్లు, దెబ్బతిన్న పంట కాలువలతో పాటు నష్టం అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వారు నివేదికలు అందించగానే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓలు స్వర్ణలత, శ్రీదేవి, తహసీల్దార్లు కృష్ణప్రసాద్, ముజాహిద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, ఏపీఎం వెంకటేశ్వర రెడ్డి, అధికారులు సురేష్, కృష్ణ, అఫ్జల్ బేగం, చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి


మహిళా హోంగార్డుకు కేక్ తినిపిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్ : ప్రజాసేవతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ వినీత్ అన్నారు. హోంగార్డ్స్ డే సందర్భంగా స్థానిక ఐఎంఏ హాల్‌లో బుధవారం నిర్వహించిన వేడుకలకు హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని, భారీ వర్షాలు, వీవీపీల పర్యటనలు, ఎన్నికల సమయంలో వారి సేవలు అభినందనీయమని చెప్పారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయిమనోహర్, ఏఆర్ ఏఎస్పీ విజయ్‌బాబు, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీలు వెంకటేష్, రెహమాన్, రాఘవేంద్రరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించాలి

భారీ వర్షాలతో ప్రాణనష్టం జరగకుండా పోలీసులు, వివిధ శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారని, ప్రజలు వారికి సహకరించాలని ఎస్పీ డాక్టర్ వినీత్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ ప్రాంతాల్లో రహదారులపైకి వర్షపు నీరు చేరిందని, ఆయా రోడ్లపై రాకపోకలు నిలిపేసేందుకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అశ్వారావుపేట మండలంలోని వాగొడ్డుగూడెం వద్ద రోడ్డుపైన 5 అడుగుల మేర నీరు ప్రవహిస్తోందని, అశ్వారావుపేటలో దొంతికుంట చెరువు వరదనీరు ఇళ్లలోకి చేరిందని, అలాంటి ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దమ్మపేట మండలంలో నాచారం –నాగులపల్లి, అసన్నగూడెం మల్లెపూల వాగు రోడ్డు, దమ్మపేట – మొద్దులగూడెం రోడ్డుపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిషేధించామని పేర్కొన్నారు.

దెబ్బతిన్న పంటలు

రైతన్నకు కన్నీటి వేదన మిగిల్చిన మిచాంగ్ తుపాన్

మిచాంగ్ తుపాన్ రైతులను నిండా ముంచింది. వరి పంటతోపాటు పత్తి, మిర్చి మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం జరిగింది. మినుము, వేరుశనగ, పెసర చేలు, ఆయిల్‌పామ్, అరటి, పొగాకు తోటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో చేతి కందే దశలో ఉన్న పంటలు చేజారిపోయాయి. వరిపైరు నేలవాలి నీటిలో మునిగింది. కోసిన పనలు కూడా మునిగిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. తీసేందుకు సిద్ధంగా ఉన్న దూది పింజలు రాలి నేలమీద పడ్డాయి. తడిసిన పత్తి రంగు మారి ధర పడిపోయే అవకాశం ఉంది. ఈదురుగాలులకు కాతమీద ఉన్న మిరపచెట్లు ఒరిగిపడ్డాయి. మొక్కజొన్న కూడా నేలవాలింది. వానాకాలం సీజన్ పంటలు చేతికందే తరుణంలో మిచాంగ్ తుపాన్ రైతులకు కన్నీటి వేదనను మిగిల్చింది. ముసురు పెట్టడంతో నేల నాని విద్యుత్ స్తంభాలు, చెట్లతోపాటు ఇంటి గోడలు కూలాయి. వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఓసీల్లో వర్షపు నీరు నిలిచి యంత్రాలు, వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అక్కడక్కడా రోడ్లు కోతకు గురయ్యాయి. –సాక్షి నెట్‌వర్క్


జూలూరుపాడు: కరివారిగూడెంలో నేలవాలి, నీట మునిగిన వరి పంట


గుండాల: ఆళ్లపల్లి మండలం రాయిపాడులో తడిసిన వరి పనలను తీస్తున్న రైతులు


వైరారూరల్: లింగన్నపాలెంలో దెబ్బతిన్న మొక్కజొన్న


పాల్వంచ: కూలిన విద్యుత్ స్తంభం


టేకులపల్లి: తడిసిన పంటను చూపుతున్న రైతు


దమ్మపేట: ముష్టిబండ శివారులో కోతకు గురైన రోడ్డు


కరకగూడెం: కల్లంలో నిలిచిన వర్షపు నీటిలో నుంచి ధాన్యం ఎత్తుతున్న రైతులు


అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ తోటలో భారీగా నిలిచిన వరదనీరు


కొణిజర్ల: కాచారంలో పడిపోయిన మొక్కజొన్న


ఇల్లెందు రూరల్: కొమరారంలో నేలవాలిన మిర్చి తోట


వైరారూరల్: దాచాపురంలో వర్షానికి తడిసిన ధాన్యం రాశులు


అశ్వారావుపేటరూరల్: యార్డులో వర్షపునీరు చేరి తడిసిన ధాన్యం రాశులు


చర్ల: తేగడ సమీపంలో నేలవాలిన వరి


ములకలపల్లి: వర్షానికి తడిసిపోయిన వేరుశనగ పంట


రఘునాథపాలెం: మల్లేపల్లిలో వరిపొలంలో చేరిన వర్షపునీరు


కల్లూరు రూరల్: రఘునాథగూడెంలో కల్లం నుంచి వర్షపు నీరు వెళ్లదీస్తున్న రైతులు


వేంసూరు: చేతికొచ్చిన వరి.. తుపాన్ ధాటికి ఇలా..


సుజాతనగర్: లక్ష్మీదేవిపల్లిలో కూలిన ఇంటి గోడ


అన్నపురెడ్డిపల్లి: కోతకు గురైన సీతారామ బ్రిడ్జి


మణుగూరు టౌన్: బురదమయంగా మారిన సింగరేణి ఓపెన్‌కాస్టు, గనిలో నిలిచిన వాహనాలు

క్లుప్తంగా

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి


డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఎంవీఐ తిరుపతి

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించే ముక్కోటి వేడుకలకు వచ్చే భక్తులతో ఆటో డ్రైవర్లు మర్యాదగా ప్రవర్తించాలని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి సూచించారు. పట్టణంలోని ఎంవీఐ కార్యాలయంలో బుధవారం టాటా మ్యాజిక్, ఆటో యూనియన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. భక్తుల నుంచి అధిక చార్జీలు వసూళ్లు చేసినా, వారిని ఇబ్బందులకు గురిచేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'త్రివేణి' విద్యార్థులకు అభినందనలు

ఖమ్మంసహకారనగర్: రాష్ట్రస్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన ఖమ్మంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులను అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ అభినందించారు. త్రివేణి ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, విద్యార్థులు బుధవారం అదనపు కలెక్టర్‌ను కలవగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికవడంపై హర్షం వ్యక్తం చేశారు. అలాగే, డీఈఓ సోమశేఖరశర్మ, పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి, వివిధ విభాగాల బాధ్యులు మురళీకృష్ణ, స్వప్న, ముస్తఫా, అశోక్ కూడా విద్యార్థులను అభినందించారు.

పోడుదారుల అరెస్ట్?

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు పంచాయతీలోని మాదిగపోల్ ప్రాంతంలో పోడు సాగుచేస్తున్న 10 మందిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసినట్లు తెలిసింది. పోడు సాగు చేస్తున్నారనే నెపంతో లోతువాగు పంచాయతీకి చెందిన కోడమ్ ముత్తయ్య, అయం కనుకయ్య, వార్డు మెంబర్ గంగారాజు, సీతారాములు, చిన్ననారాయణ తదితరులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం. ఈవిషయమై రేంజర్ సురేష్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

ఆలయంలో చోరీ

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురం శ్రీకోదండ రామాలయంలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని ముందు భాగంలో ఉన్న ఇనుప గ్రిల్స్‌ను తొలగించి గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు ప్రవేశించారు. హుండీని పగులకొట్టి నగదును అపహరించారు. సుమారు రూ.5 వేల నగదు చోరీ జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ ఉపేంద్రరెడ్డి తెలిపారు. కొత్తగూడెం క్లూస్ టీంతో పాటు ఎస్సై షాహీన సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పునరావాస కేంద్రానికి తరలింపు

కేసీఆర్ డబుల్‌బెడ్‌రూం వాసులకు రైతువేదికలో ఆశ్రయం


బాధితులకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చంద్రుగొండ : చంద్రుగొండ శివారు ఎదుళ్లవాగు వద్ద ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లల్లో ఉంటున్న లబ్ధిదారులను అధికారులు బుధవారం రాత్రి పునరావాస కేంద్రానికి తరలించారు. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎదుళ్లవాగు పొంగిప్రవహిస్తోంది. ఈ క్రమంలో రాత్రి మళ్లీ వరద పెరిగితే ప్రమాదం పొంచి ఉంటుందని అధికారులు భావించారు. దీంతో డబుల్ బెడ్ రూమ్‌ల సముదాయంలో ఉంటున్న 40 మందిని డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఎస్‌ఐ మాచినేని రవి ఆధ్వర్యంలో వాహనాల్లో తరలించారు. చంద్రుగొండలోని రైతువేదికలో బాధితులకు పునరావాసం కల్పించారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

వర్షానికి తడిసి 50 గొర్రెలు మృతి


మృతి చెందిన గొర్రెలు


అశ్వాపురం: మండల పరిధిలోని సీతారాంపురం–గొల్లగూడెం గ్రామాల మధ్య సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద బుధవారం తెల్లవారుజామున 50 గొర్రెలు మృతి చెందాయి. మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామ పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన బొల్లు కొమరయ్య, ఐలయ్య, శ్రీను, ఉప్పలయ్య, కోరెం సత్యనారాయణకు చెందిన 50 జీవాలను యజమానులు మేత కోసం వేరే ప్రాంతాలకు తోలుకెళ్లారు. మంగళవారం పగలంతా మండలంలో అమెర్ద, చింతిర్యాల గ్రామాల్లో మేపారు. రాత్రి గొర్రెలు తోలుకుని స్వగ్రామానికి వెళ్తుండగా గొర్రెలు నడవలేక పోవడంతో సీతారాంపురం గ్రామ సమీపంలో నిలిపారు. దీంతో రాత్రంతా వర్షంలో తడిసి తెల్లవారుజామున గొర్రెలు మృతి చెందాయి. ఇంకా కొన్ని గొర్రెలు చనిపోయే స్థితితో ఉన్నాయని యజమానులు తెలిపారు. అధికారులు స్పందించి మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గొర్రెల పెంపకందారుల సహకార సంఘం మండల అధ్యక్షుడు ముత్తబోయిన వెంకటేశ్వర్లు, బాధితులు కోరారు.

మృతుల కుటుంబానికి పొంగులేటి రూ.లక్ష ఆర్థిక సాయం


కూలిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న దయాకర్‌రెడ్డి, ఏసీపీ బస్వారెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో మంగళవారం రాత్రి ఇంటి గోడ కూలగా దంపతులు నూకతోటి పుల్లారావు – లక్ష్మి మృతి చెందారు. బుధవారం ఖమ్మం ఆర్‌డీఓ గణేశ్, ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ అనురాధాబాయి ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. అలాగే, పుల్లారావు – లక్ష్మి మృతదేహాల వద్ద పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ ఈవూరి సుజాత, నాయకులు కనమర్లపూడి పుష్పలత, ఈవూరి శ్రీనివాసరెడ్డి, కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేశ్, కనమర్లపూడి రాము, కల్లెం కృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, రవి, మరికంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా వెన్నెల జలపాతం


వెన్నెల జలపాతం

మణుగూరు రూరల్: తుపాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మణుగూరు మండలంలోని హనుమాన్ టెంపుల్ సమీపంలో ఉన్న వెన్నెల జలపాతం ఆహ్లాదం పంచుతోంది. రథంగుట్టపై నుంచి వయ్యారంగా జాలువారుతోంది. పలువురు జలపాతం వద్దకు వెళ్లి సందడి చేస్తున్నారు.

చెట్టు తొలగించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

మధిర: మిచాంగ్ తుపాన్ కారణంగా రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఖాజీపురం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో భారీ వృక్షం నేలకూలింది. ఈ చెట్టు మధిర – తిరువూరు ప్రధాన రహదారికి అడ్డుగా ఉండడంతో వాహనాల రాకపోలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మాటూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చెరుపల్లి శ్రీహరి, ఉపాధ్యాయుడు మేడేపల్లి శ్రీనివాసరావు, విద్యార్థులు ఎర్రబోలు ఎల్లేశ్వరరావు, శ్రీరాముల ఉపేంద్ర తదితరులు చెట్టును తొలగించగా పలువురు అభినందించారు.


రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టును తొలగిస్తున్న దృశ్యం

బొగ్గు లారీ బోల్తా


సాయన్నపేట సమీపంలో బోల్తాపడిన లారీ

టేకులపల్లి: బొగ్గు లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భూపాలపల్లి నుంచి బొగ్గు లోడుతో పాల్వంచ వైపు వస్తున్న లారీ తొమ్మిదోమైలుతండా పంచాయతీ సాయన్నపేట సమీపంలో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. రోడ్డు పక్కన లోయలోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ వంశీ తీవ్రంగా గాయపడి, లారీ కేబిన్‌లోనే ఇరుక్కుపోయాడు. సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ రమణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికుల సాయంతో డ్రైవర్‌ను బయటకు తీసి 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య

పాల్వంచ: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కారెగట్టు పంచాయతీ సారెకల్లు గొత్తికోయ గ్రామానికి చెందిన మడకం పెద దేవ(23) ఈ నెల 5న రాత్రి 8గంటల సమయంలో భార్యతో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఉన్న దేవ ఇంట్లోని పురుగుల మందు తాగి స్పృహ తప్పిపడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని..

ఉరి వేసుకుని బాలుడు మృతి

అశ్వారావుపేటరూరల్: తల్లి మందలించిందని మనస్తాపం చెంది ఓ బాలుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన 16 ఏళ్ల బాలుడు స్థానిక జెడ్పీఎస్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. కొద్ది రోజులుగా చదువు పట్ల నిర్లక్ష్యం చేస్తూ, తన మిత్రులతో కలిసి సెల్‌ఫోన్లో గేమ్స్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం బయటకు వెళ్లిన బాలుడు తిరిగి రాత్రి 9గంటల తర్వాత ఇంటికి రాగా, తల్లి మందలించింది. దీంతో బాలుడు మనస్తాపం చెందాడు. తల్లి అన్నం పెట్టేందుకు వంట గదిలోకి వెళ్లగా, కుమారుడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన తల్లి చుట్టు పక్కలవారి సాయంతో బాలుడిని కిందకు దించి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. బాలుడి తండ్రి గతంలోనే మృతి చెందాడు. ఉన్న ఒకే ఒక్క కొడుకు సైతం మృతి చెందడంతో తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

గంజాయి కేసులో 12 ఏళ్ల జైలుశిక్ష

కొత్తగూడెంటౌన్: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితుడికి 12ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి(సెషన్స్ జడ్జి ఎన్‌డీపీఎస్ యాక్ట్) ఎం.శ్యాంశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తీర్పు వివరాలిలా ఉన్నాయి. 2020, జూలై 10న భద్రాచలం సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రామయ్య తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. భద్రాచలం సబ్ జైలు కరకట్ట వద్ద ఆగి ఉన్న కారులో తనిఖీ చేయగా రూ.32లక్షలకు పైగా విలువైన 219.200 కేజీల గంజాయి లభ్యమైంది. కారులోని వ్యక్తిని విచారించగా వరంగల్ శివనగర్‌కు చెందిన తోకల కుమారస్వామిగా తేలింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణ అనంతరం కుమారస్వామికి 12ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రావి విజయ్‌కుమార్ వాదించగా, ఎం.హరిగోపాల్, గంజి శశిధర్ సహకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ 30 ఎకరాల DTCP, Rera అప్రూవ్డ్ వెంచర్ ఓపెన్ ప్లాట్స్ ఇండిపెండెంట్ హౌసస్, విల్లాస్ కలవు. టెలికాలర్స్, ఏజెంట్లు కావలెను. పూర్తి వివరాలకు సంప్ర. 99636 08313, 84649 45489 [M-10821]

PLOT FOR SALE

■ ఖమ్మం పట్టణం సమీపంలో DTCP, SUDA, Rera అన్ని అనుమతులతో కూడిన ప్లాట్స్ తక్కువ ధరలలో కలవు. భారతి రియల్ ఎస్టేట్స్ అండ్ డెవలపర్స్. సంప్ర. 91775 54110, 94401 01408. [M-2910]

Services

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు. సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788962]

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర ✆ 945 945 3338 [B-763]

WATER PROOFING

■ మీరు వాటర్ లీకేజీ సమస్యలతో బాధపడుతున్నారా? మీ ఇంట్లో స్లాబ్స్, వాటర్ ట్యాంక్స్, Out side వాల్ బాత్‌రూమ్స్ ఏ ఇతర లీకేజీలు అయినా అధునాతన కెమికల్స్‌తో 10 సం॥ గ్యారంటీతో. 9966773737. [M-1221885]

Wanted

■ ఖమ్మంలో ప్రముఖ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. జీతం : 11,000నుండి 13 వేలు. వివరాలకు సంప్ర. సెల్ : 70361 91924, 95028 82478. [M-1221932]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221884]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K Ph: 9160900024/ 9640400073 [H-793661]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి సూపర్ వైజర్స్, లేడి నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12568]

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ 12/24గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 63010 53500, 82474 50643 [B-1255407]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి ద్వారా మీ చిన్నారి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేయండి
కేవలం రూ. 500/- మాత్రమే
(GST 5% అదనం)

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

సాయం.. శరవేగం

ఏపీ సీఎం ఆదేశాలతో సహాయక చర్యలు ముమ్మరం



సాక్షి, అమరావతి / సాక్షి నెట్‌వర్క్: తుపాను ప్రభావానికి గురైన జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికార యంత్రాంగం వేగంగా సహాయక చర్యలు చేపట్టింది. తుపాను ప్రారంభం కాక ముందు నుంచే కట్టుదిట్టంగా ముందస్తు ఏర్పాట్లు చేయడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించగలిగారు. ఎనిమిది జిల్లాల్లో 320 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి.. 20,572 మందిని తరలించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 124 శిబిరాల్లో 6,077 మందికి ఆశ్రయం కల్పించారు. తిరుపతి జిల్లాలో 36 కేంద్రాల్లో 3,386 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో 12 కేంద్రాల్లో 5,113, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 37 కేంద్రాల్లో 910, బాపట్ల జిల్లాలో 74 కేంద్రాల్లో 3,888, గుంటూరులో 14 శిబిరాల్లో 1,111, కోనసీమ జిల్లాలో 36 శిబిరాల్లో 910, పశ్చిమ గోదావరిలో 32 శిబిరాల్లో 5,113, తూర్పు గోదావరిలో 3 కేంద్రాల్లో 87 మందికి పునరావాసం కల్పించారు. బాధితులందరికీ భోజనం, మంచి నీటి సౌకర్యం కల్పించారు. వారికి అక్కడే నిత్యావసరాలు అందిస్తున్నారు. బాధిత కుటుంబాలు ఇళ్లకు వెళ్లే ముందు ఆర్థిక సాయంగా రూ.1000 నుంచి రూ.2500 అందిస్తున్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో 6 ఎస్డీఆర్ఎఫ్, 6 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. కృష్ణా జిల్లా అవనిగడ్డ, మచిలీపట్నం, ప్రకాశం జిల్లా ఒంగోలు, నెల్లూరు, ఉలవపాడు, బాపట్ల, నాయుడుపేటలో ఈ బృందాలు సేవలు అందిస్తున్నాయి. అధికార యంత్రాంగం దెబ్బతిన్న రోడ్లను వెంటనే పునరుద్ధరించడంతో రాకపోకలు యధాతథంగా కొనసాగుతున్నాయి. వర్షం తెరిపి ఇవ్వడంతో రైతులు ముంపునకు గురైన పంటలను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఆర్బీకే సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మరోవైపు రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ప్రభుత్వం తీసుకున్న సత్వర చర్యలతో రైతులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆపదలో ఉన్న రైతులను గుర్తించడమే కాకుండా, వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు వెంటనే కొనుగోలు చేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. సీఎం ఆదేశాల మేరకు తేమ శాతంతో సంబంధం లేకుండా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి.

టీడీపీకి లక్ష్యంగా అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి

ఆయనపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో తప్పుడు ప్రచారం

- ఐటీడీపీ నేతృత్వంలో ఆయన పేరుతో నకిలీ ఖాతాలు
- ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలను పొన్నవోలు దూషించినట్లు పోస్టులు
- ఆయనే వాటిని పోస్టు చేసినట్లు చిత్రీకరణ
- చంద్రబాబు స్కాంలపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోర్టుల్లో వాదిస్తున్న సుధాకర్‌రెడ్డి
- దీంతో సుధాకర్‌రెడ్డిపై టీడీపీ వర్గాల దుష్ప్రచారం



సాక్షి, అమరావతి: గత టీడీపీ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అక్రమాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయస్థానాల్లో వాదనలు వినిపిస్తున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డిని తెలుగుదేశం పార్టీ లక్ష్యంగా చేసుకుంది. ఆయనపై అనైతిక దాడులకు పాల్పడుతోంది. టీడీపీ పెద్దల ప్రోద్బలంతో సోషల్ మీడియాలో ఆ పార్టీ అనుబంధ సంఘం ఐటీడీపీ అసభ్యకర రీతిలో పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం ప్రారంభించింది. ఆయన పేరుతో సామాజిక మాధ్య మాల్లో నకిలీ ఖాతాలు తెరిచి అందులో అసభ్య పదజాలం ఉపయోగిస్తూ పోస్ట్ చేస్తోంది. ఆయనే వాటిని పోస్ట్ చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తోంది. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, తెలంగాణ సీఎల్పీ నేత రేవంత్‌రెడ్డికి, పలువురు ఎంపీలకు వ్యతిరేకంగా పొన్నవోలు ట్వీట్లు చేసినట్లుగా సామాజిక మాధ్య మాల్లో ప్రచారం చేస్తోంది. ఇందుకోసం సుధాకర్‌రెడ్డి పేరుతో ఆయన ఫొటోను ఉపయోగించి నకిలీ ఖాతాలను తెరిచింది. న్యాయవ్యవస్థపై సుధాకర్‌రెడ్డి ఆరోపణలు చేసినట్లు నకిలీ వార్తలను వ్యాప్తి చేస్తోంది. న్యాయస్థానాల్లో పొన్నవోలును ఢీకొట్టలేని టీడీపీ ఇలా తప్పుడు మార్గాలను అనుసరిస్తోంది. తద్వారా సుధాకర్‌రెడ్డి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోంది.

సీఎంగా ఉండగా చంద్రబాబు చేసిన అనేక కుంభకోణాలపై సీఐడీ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పొన్నవోలు సుధాకర్‌రెడ్డి ఏసీబీ కోర్టు మొదలు సుప్రీం కోర్టు వరకు గట్టిగా, సమర్థంగా వాదనలు వినిపిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన వాదనాపటిమతో చంద్రబాబు జైలుకెళ్లక తప్పలేదు. చంద్రబాబుకు ఏసీబీ కోర్టు 14 రోజులు పాటు రిమాండ్ విధించడం, మధ్యంతర బెయిల్ వచ్చే వరకు ఆయన జైలులోనే ఉండటంలో పొన్నవోలు కీలక పాత్ర పోషించారు. చంద్రబాబు మధ్యంతర బెయిల్, రెగ్యులర్ బెయిల్‌ను కూడా సుధాకర్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. హైకోర్టులో గట్టిగా వాదనలు వినిపించారు. హైకోర్టు చంద్రబాబుకు బెయిల్ ఇచ్చిన వెంటనే హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాలు చేయించారు. దగ్గరుండి పిటిషన్ దాఖలు చేయించి అతి తక్కువ సమయంలోనే అది విచారణకు వచ్చేలా చేయడంలో విజయం సాధించారు. ఇలా ప్రతి దశలో సుధాకర్‌రెడ్డి అడ్డు తగులుతుండటంతో టీడీపీ వర్గాలు ఆయన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఆ పార్టీ సీనియర్ నేతలు గత వారంలో ప్రతి రోజూ సుధాకర్‌రెడ్డికి వ్యతిరేకంగా మీడియా సమావేశాలు పెట్టి మరీ దూషించడం మొదలుపెట్టారు. ఆయనపై సీఎస్‌కు సైతం ఫిర్యాదు చేశారు. హైకోర్టులో సైతం ఆయనపై పిల్ దాఖలు చేయించారు. అయితే, ఇవన్నీ అంతగా ఫలించలేదు. దీంతో టీడీపీ వర్గాలు మరింత బరి తెగించాయి. ఆయన పేరుతో ప్రముఖ సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఖాతాలు తెరిచి, వాటి ద్వారా అసభ్య పదజాలంతో ట్వీట్లు చేస్తూ వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. సుధాకర్‌రెడ్డే ఆ ట్వీట్లు చేస్తున్నట్లు కూడా ప్రచారం మొదలుపెట్టాయి. ఈ విషయం సుధాకర్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా స్పందించారు. టీడీపీ తప్పుడు ప్రచారంపై పొన్నవోలు బుధవారం సీఐడీకి ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సామాజిక మాధ్యమైన 'ఎక్స్'కు సైతం మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆ ట్వీట్లను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి వాటికి భయపడేది లేదని, ఇలా వెనుక నుంచి కాకుండా తనతో నేరుగా పోట్లాడాలని ఆయన టీడీపీ నాయకులకు సవాలు విసిరారు. కుంభకోణాల్లో చంద్రబాబుకు శిక్ష పడే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తెలిపారు.

తుపాను మృతులకు ప్రధాని మోదీ సంతాపం

విపత్తులో విశేష సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసలు



సాక్షి, న్యూఢిల్లీ: 'మిచాంగ్' తుపాను ప్రభావంతో మృతి చెందిన వారికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతాపం ప్రకటించారు. తుపాను ప్రభావిత రాష్ట్రాల్లో పెనుగాలుల బీభత్సం, వర్ష సంబంధిత ఘటనల్లో పలువురు మృతి చెందడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొంటున్న అధికారుల సేవలను ప్రధాని కొనియాడారు. పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు వీరంతా సేవలందిస్తారని బుధవారం 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

ఉత్తర తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌పై కొనసాగుతున్న వాయుగుండం



సాక్షి, హైదరాబాద్: ఉత్తర తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయుగుండం కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారుతుందని, దీని ప్రభావంతో గురు వారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మాదిరి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. శుక్రవారం రాష్ట్రంలో పొడివాతావరణమే ఉంటుందని తెలిపింది. కాగా, బుధవారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. గరిష్ట ఉష్ణోగ్రత మహబూబ్‌నగర్‌లో 30 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 17.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

గూడ్స్ రైలుకు తప్పిన ప్రమాదం

పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి సమీపాన గూడ్స్ రైలుకు ప్రమాదం తప్పింది. భారీ వర్షాల కారణంగా ఇక్కడ రైల్వే ట్రాక్‌పై కొండచరియలు పడ్డాయి. అదే సమయానికి గూడ్స్ వస్తుండగా, గుర్తించిన సిబ్బంది రాకపోకలను నిలిపివేశారు. యుద్ధ ప్రాతిపదికన ట్రాక్‌పై రాళ్లను తొలగించి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. కాగా, సత్తుపల్లి మండలంలోని ఓసీల నుంచి నిత్యం కొత్తగూడెంకు వేల టన్నుల బొగ్గు గూడ్స్ రైళ్ల ద్వారా రవాణా జరుగుతుంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగానే కొండచరియలు ట్రాక్‌పై పడి ఉంటాయని భావిస్తున్నారు.

పంట.. నీటిపాలు



బూర్గంపాడులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి చేను



కూసుమంచి మండలం నేలపట్లలో తడిసిన మిర్చిని ఆరబోస్తున్న రైతులు

▶ మొదటి పేజీ తరువాయి

నేలవాలుతోంది. గాలులకు ఆరిపోయి ఉన్న కంకుల నుంచి గింజలు నేలరాలిపోతున్నాయి. ఇక నేలవాలిన కంకులు తేమ కారణంగా మొలకొచ్చే ప్రమాదం కూడా ఉంది. ఇక నేలవాలిన వరిని యంత్రాలు కోయటం అంతగా సాధ్యం కాదు. కూలీలతో వరికోతలు జరిపించాల్సి ఉంటుంది. దీంతో రైతులకు ఖర్చులు మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఓ వైపు పంట నేలవాలి కొంత దెబ్బ తినగా, మరో వైపు కూలీల ఖర్చులు పెరిగి పెట్టుబడులు మరింతగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయి. ఇక కల్లాల్లో ఆరబెట్టిన రైతులు రాశులుగా చేసి టార్పాలిన్లను కప్పి రక్షించుకునే పనిలో ఉన్నారు. తేమతో ఉన్న ధాన్యం రాశులు నాణ్యత కోల్పోతాయని రైతులు దిగులు చెందుతున్నారు. రెండు రోజులు తుపాను కొనసాగితే రాశుల్లో మొలకొచ్చే ప్రమాదం కూడా ఉందని రైతులు చెబుతున్నారు.

మిర్చిది అదే పరిస్థితి...

కాత దశలో ఉన్న మిర్చి పైర్లు నేలవాలే ప్రమాదం ఉంది. మిర్చి కాయబరువుతో చెట్టు పడిపోతుందని రైతులు చెబుతున్నారు. అక్కడక్కడ తొలి కోతలు కూడా సాగుతున్నాయి. కోసిన మిర్చి ఆరబెట్టకుండా రాశులుగా కల్లాల్లో ఉంచితే తేమబారిన పడి నాణ్యత కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తేమతో ఉన్న కాయకు నల్లమచ్చ ఆశించే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వానలు మాత్రం రైతులను నష్టపరుస్తున్నాయే తప్పా ప్రయోజనం కలిగించటం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీగానే నష్టం

ఖమ్మం జిల్లాలో 53,903 మంది రైతులకు చెందిన 82,191 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో అధికంగా వరి 59,307 ఎకరాల్లో నష్టపోయినట్టు చెబుతున్నారు.

- భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 7,450మంది రైతులకు సంబంధించిన 13,608 ఎకరాల్లో వరి, వేరుశనగ, మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటలు ధ్వంసమైనట్లు అంచనావేశారు. ప్రస్తుతం అధికారులు అంచనాల్లో నిమగ్నం కాగా.. ఒకటి, రెండు రోజుల్లో పంట నష్టంపై స్పష్టత రానుంది.
- వాజేడు మండలంలో ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ ప్రాంత ప్రజలను కాపాడేందుకు ఏటూరునాగారంలో పోలీస్ విపత్తు దళం ముళ్లకట్ట వద్ద హైపవర్ బోటులో రీహార్సల్ చేపట్టింది.

చనిపోయిన 13 వేల బాతులు... గుండెపోటుతో యజమాని మృతి



ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టాపురానికి ఏపీలోని జగ్గయ్యపేట మండలానికి చెందిన పేరం ఆదిలక్ష్మి(67) కుటుంబ సభ్యులతో కలిసి బాతులను తీసుకొచ్చి పెంచుతున్నారు. తుపాన్ ప్రభావంతో తడిచిన 13వేల బాతు పిల్లలు మృతి చెందడంతో యజమాని ఆదిలక్ష్మి గుండెపోటుతో మృతి చెందారు.

పరిహారం ఇవ్వాలి: తెలంగాణ రైతు సంఘం

రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టాన్ని తక్షణం అంచనా వేసి నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు రూ. 20 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 40 వేలు చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి.సాగర్ కోరారు.

పంటలు తడిసి ముద్దయ్యాయి: కూనంనేని

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని కోరారు. పత్తి, మిర్చికి ఎకరాకు రూ. 40 వేలు, వరికి ఎకరాకు రూ.20 వేలు, కూరగాయలకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

-ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్



అధికారులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ప్రాజెక్టు ఆఫీసర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం యూనిట్ అధికారులతో సమావేశమైన ఆయన పనుల పురోగతిపై ఆరా తీశారు. సబ్ సెంటర్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే, ఆశ్రమ, గురుకులం పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వంద శాతం ఉత్తీర్ణత శాతం నమోదయ్యేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, డీఎం హెచ్ఓ శిరీష, అధికారులు తానాజీ, ఉదయ్ భాస్కర్, ఎస్.రవిబాబు, అశోక్ పాల్గొన్నారు.


సింగరేణి దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రకాశం స్టేడియంలో సింగరేణి దినోత్సవం నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఈ సమావేశంలో అధికారులు సూర్యనారాయణ, శామ్యూల్ సుధాకర్, కోడూరి శ్రీనివాసరావు, రాజశేఖర్, రాజీవ్‌కుమార్, వి.సోమయాజులు, ఎం.రాజ్‌కుమార్, ఎం.చంద్రమౌళి, వైవీఎల్ వరప్రసాద్, ఎ.కృష్ణమోహన్, విక్టర్ వందనం, పి.విజయ్‌ప్రసాద్, అనంతరాములు, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతూ.. తగ్గుతున్న గోదావరి



కిన్నెరసాని ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తడంతో వెళ్తున్న వరద



పెదవాగు ప్రాజెక్టు గేటు ఎత్తగా దిగువకు వెళ్తున్న వరద

భద్రాచలంటౌన్: మిచాంగ్ తుపాను ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి స్వల్పంగా పెరిగి.. ఆ తర్వాత తగ్గింది. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో వరదనీరు నదిలోకి చేరింది. దీంతో బుధవారం ఉదయం 11 అడుగులకు చేరిన నీటిమట్టం రాత్రికి 9.2 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల్లో వరద ఎక్కువగా లేకపోవడంతో మరింత తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల..

పాల్వంచ: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 407 అడుగులు కాగా, బుధవారం 404.60 అడుగు ల మేర చేరింది. మరో 8వేల క్యూసెక్కుల వరద వస్తుండడంతో అధికారులు రెండుగేట్లు ఎత్తి ఎనిమి ది వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పెదవాగు ప్రాజెక్ట్ నుంచి...

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు రెండో గేట్‌ను 1.5మీటర్లు పైకి ఎత్తి 4,028 క్యూసెక్కుల వరదను గోదావరిలోకి విడుదల చేసినట్లు డీఈఈ కృష్ణ, ఏఈఈ కృష్ణ తెలిపారు.

పాలేరుకు వరద..

కూసుమంచి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌కు వెయ్యి క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. 23 అడుగుల నీటిమట్టానికి గాను బుధవారం 20.25 అడుగులకు చేరింది. దీంతో సాగర్ నుంచి నీటి విడుదల ఆపేయగా.. పంటలకు అవసరం లేకపోవడంతో పాలేరు నుంచి దిగువకు కూడా నీటి విడుదల నిలిపేశారు.

బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం

- 1.18 లక్షల టన్నుల మేర వెనుకంజ
- స్తంభించిన రవాణా, ఓబీ వెలికితీత



సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సీహెచ్‌పీ వద్ద వ్యాగన్లలో బొగ్గు నింపుతున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లిటౌన్/టేకులపల్లి/మణుగూరుటౌన్: సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటికే 3.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడగా.. మూడు రోజులుగా మిచాంగ్ తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలు మరింత దెబ్బతీశాయి. సంస్థ వ్యాప్తంగా ఈ ఏడాది 75 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా, రోజుకు 3 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. కానీ, భారీ వర్షాల కారణంగా రోజుకు లక్ష్యంలో 1.82 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. తద్వారా రోజుకు సుమారు రూ.6 కోట్ల విలువైన ఉత్పత్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. సింగరేణి వ్యాప్తంగా 19 ఓపెన్ కాస్ట్ గనుల్లో రోజుకు 15.25 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ (ఓబీ) తీయాల్సి ఉండగా, మంగళవారం 7 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ మాత్రమే తీయగలిగారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఓసీల్లోని క్వారీలు బురదమయంగా మారాయి. యార్డులో బొగ్గు తడిచి ఉండటంతో రవాణా నిలిచిపోగా, కేవలం రైల్వేవ్యాగన్ల ద్వారా మాత్రమే బొగ్గు రవాణా జరుగుతోంది. కాగా, సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లోకి భారీగా వరద చేరడంతో 40 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.10 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీతకు ఆటంకం ఏర్పడింది. ఇక టేకులపల్లి మండలం కోయగూడెం ఓపెన్‌కాస్టులో రెండు రోజులుగా 18 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 66 వేల మెట్రిక్ టన్నుల ఓబీ ఉత్పత్తి ఆగిపోయింది.

రైతులూ.. జాగ్రత్త వహించండి

ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణపై అధికారుల సూచనలు



రఘునాథపాలెం మండలంలో నేలవాలిన మిరపతోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి మీనాక్షి

రఘునాథపాలెం: తుపాన్ కారణంగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిరప, బొప్పాయి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఆయా పంటలను బుధవారం పరిశీలించిన ఖమ్మం ఉద్యాన అధికారి మీనాక్షి.. వీటిని కాపాడుకునేందుకు గాను రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అధిక వర్షాలతో నేల పోషకాలు కోల్పోవడమే కాక నేల కోతకు గురై మొలక శాతం తగ్గిపోతుందని తెలిపారు. ఇంకా విత్తనం కుళ్లిపోవడం, కలుపు తీవ్రత పెరగడం, చీడపీడలు అధికమవడం వంటి సమస్యలు ఎదురవుతాయని చెప్పారు. ఈ మేరకు వర్షాలు ఆగగానే పొలంలోని నీటిన బయటకు పంపించాలని సూచించారు. పోషకాల లోపం నివారణకు 19:19:19 లేదా 13:0:45 లేదా యూరియా 10 గ్రాములను ఒక లీటర్ నీటికి కలిపి వర్షాలు ఆగగానే పిచికారీ చేయాలని తెలిపారు. అంతేకాక అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాల మిశ్రమం (మాక్స్ ఆర్ లేదా విపుల్ లేదా గ్రోత్ లేదా ఫార్ములా–4) 2–3 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

ఇక నారుమడులు కుళ్లిపోయే అవకాశమున్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. నేలలో తేమ పెరిగిన నేపథ్యాన కూరగాయల తోటలను వేరుకుళ్లు, ఎండు తెగులు ఆశిస్తాయని, దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా మెటలాక్సిన్+మాంకోజెబ్ 2.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి మొక్కల మొదళ్లలో పోయాలని చెప్పారు. ఆకుమచ్చ, బూజు తెగుళ్ల నివారణకు కార్బండాజిమ్–1 గ్రాము లేదా మాంకోజెబ్ 2.5 గ్రా లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా హెక్సాకొనజోల్ 2 మి.లీ.ను ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, బాక్టీరియా మచ్చతెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు + ప్లాంటామైసిన్ 0.2 గ్రా.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, నేలకొరిగిన మొక్కలకు కర్రల సాయంతో ఊతం అందించాలని ఉద్యాన శాఖ అధికారి మీనాక్షి వెల్లడించారు.

వలలో చిక్కిన కొండచిలువ



దమ్మపేట: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చెరువులు పొంగిపొర్లుతుండగా, చేపల వేటకు వెళ్లిన వారి వలకు కొండచిలువ చిక్కింది. దమ్మపేటలో చెరువు పొంగి కాల్వ పారుతుండగా, స్థానికులు వలలతో చేపల వేట ప్రారంభించారు. అయితే, ఓ వ్యక్తి వలలో కొండచిలువ చిక్కడంతో ఆందోళనకు గురయ్యారు. వల నుంచి కొండచిలువను విడిపించే క్రమంలో అది దాడికి యత్నించగా, వారు కొండచిలువను చంపేశారు.

మౌలిక వసతుల కల్పన కోసం టెండర్ల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పీఓ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న టెండర్‌దారులు జీఎస్టీ నంబర్, బ్యాంకు ఖాతా వివరాలతో ఐటీడీఏ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు రూ.2 వేలు చెల్లించి టెండర్ల దరఖాస్తులు తీసుకోవచ్చని వివరించారు.

రైతులను ఆదుకోవాలి

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న శ్రీధర్‌రెడ్డి, నాయకులు

మధిర: మిచాంగ్ తుపాన్‌తో తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కోరారు. వ్యవసాయ అధికారులు సత్వరమే పంట నష్టం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. మధిర మండలంలోని నిదానపురంలో బీజేపీ నాయకులతో కలిసి బుధవారం పంటలను పరిశీలించాక ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. కొత్త ప్రభుత్వమైనా పంటల బీమా పథకాన్ని తీసుకురావాలని కోరారు. అలాగే, తుపాన్‌తో నష్టపోయిన రైతాంగానికి భరోసా ఇచ్చేలా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పెరుమాళ్లపల్లి విజయరాజు, అనంత ఉపేందర్‌గౌడ్, గుండా చంద్రశేఖర్‌రెడ్డి, అమరవాది వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఓటమిని తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం



బద్యానాయక్‌కు పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రియాంక

రఘునాథపాలెం: తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందడం, కేసీఆర్ సీఎం కాకపోవడాన్ని తట్టుకోలేక రఘునాథపాలెం మండలం హరియా తండాకు చెందిన ఎం.బద్యానాయక్ బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రఘునాథపాలెం సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. ఈ నెల 3న ఫలితాలు వెలువడ్డాక బీఆర్ఎస్ అధికారంలోకి రావడం లేదని హరియా ఆవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం పురుగుల మందు తాగగా, ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో సైతం బద్యానాయక్ ఈ విషయమై వాంగ్మూలం ఇచ్చారని సీఐ తెలిపారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బద్యానాయక్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు మాలోత్ ప్రియాంక, నాయకులు దేశ్యానాయక్, రాజానాయక్ తదితరులు పరామర్శించారు.